

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ చేతన

# పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు

- 260 పోలింగ్ కేంద్రాలు..24 రూట్లు
- 48 ప్రత్యేక వాహనాలు
- చేరుకున్న అధికారులు, సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లో పోలింగ్ సామగ్రి చూసుకుంటున్న సిబ్బంది

జ్యోతినగర్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రామగుండం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల అధికారులు 260 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని సామగ్రితో తరలించారు. ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నియోజకవర్గ డిస్ట్రిబుషన్ సెంటర్ నుంచి 24 రూట్లకు గాను 24మంది సెక్టార్ ఆఫీసర్లు, 24మంది స్పెషల్ ఆఫీసర్లు, 260 బూత్‌లకు 260మంది మైక్రో అబ్జర్వర్లు, కేంద్రానికో పీవో, ఏపీవోల చొప్పున మొత్తం 3వేల వరకు పోలింగ్ సిబ్బందికి సరిపడా ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్స్ అందించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 48 బస్సుల్లో ఆయా బూత్‌లకు తరలివెళ్లారు. ముందుగా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల నిర్వహణ ప్రిసైండెంగ్, అసిస్టెంట్ ప్రిసైండింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు విధులకు హాజరైనట్లుగా సంతకం చేసి ఆర్డర్ కాపీని తీసుకున్న అనంతరం పోలింగ్ నిర్వహణకు అధికారులు నిర్వహించిన ప్రత్యేక కౌంటర్లలలో బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్, కంట్రోల్ యూనిట్ ఈవీఎంలు, ఇతర స్టేషనరీ సామగ్రిని తీసుకోని ఈవీఎంలను పనితీరును పరీక్షించుకోని పోలింగ్ బూత్‌లకు తరలివెళ్లారు. ఈ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సందర్శించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని ఉండాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్ సందర్శించి భద్రత చర్యలను కటుట్టదిట్టం చేశారు. పోలింగ్ విధులకు వచ్చిన సిబ్బంది కోసం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ, ఏఆర్‌ఓ కుమారస్వామి, నోడల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్స్ జింక మల్లేశం, కేడం శ్రీనివాస్, అంజన్‌కుమార్, సంతోశ్, స్వరూప్‌చంద్, శ్రీధర్, శ్రీనివాస్ ఉన్నారు.

## పోలింగ్ ఏర్పాటు పూర్తి : కలెక్టర్

జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. రామగుండం నియోజకవర్గం పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణాతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గంలో 838 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణలో ఓటర్లకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు నిర్వహించమన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు. టాయిలెట్, ఇతర వసతులు కల్పించామన్నారు. దివ్యాంగులకు అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 7లక్షలకు పైబడి ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధిక పోలింగ్ నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై ఇప్పటికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లాలో అత్యధికంగా పోలింగ్ నమోదు కానున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో 80-83శాతం జిల్లాలో పోలింగ్ జరిగిందని, రామగుండంలో 70శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి రామగుండంలో 80శాతం పోలింగ్ దాటుతోందన్నారు. జిల్లాలో 90శాతంకు పోలింగ్ చేరుకుంటుందన్నారు. భద్రతలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఆదనపు బలగాలను మోహరించామని తెలిపారు. ఇక్కడ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ, ఏఆర్‌ఓ కుమారస్వామి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ విజయ్, డీసీపీ చేతన, ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, సీఐ చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.



ఈవీఎంలు అందజేస్తున్న అధికారి

### పోలింగ్‌ను సజావుగా ముగించాలి

పోలింగ్ ప్రక్రియను సజావుగా ముగించాలని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ సూచించారు. రామగుండం నియోజకవర్గ పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఆర్వో సెక్టార్ అధికారులకు పోలింగ్ సామగ్రి తరలింపుపై దిశానిర్దేశం చేశారు. ఈవీఎంల తరలింపు,వాహనాలు,భద్రత బలగాల ఏర్పాట్లు పూర్తిస్థాయి పర్యవేణలో ఉంటాయని, ఈవీఎంలలో సాంకేతిక లోపాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు పోలింగ్ కేంద్ర పరిసరాల్లో తలెత్తినచో తక్షణమే సంబంధిత సెక్టార్ అధికారులు, భద్రతల బలగాలకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ ఏజెంట్లతో సమన్వయంతో నడుచుకుంటూ, ఓటర్ల సందేహాలపై స్పష్టత ఇస్తూ, పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ పోలింగ్ సజావుగా ముగిసేలా చూసి అనంతరం ఈవీఎం పరికరాలను పగడ్బందీగా కౌంటింగ్ కేంద్రాలకు తరలించుటకు గుర్తింపు పొందిన వాహనాల్లో ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలయందు సాయంత్రం 5గంటలకు కాంపౌండ్ గేట్ మూసివేయాలన్నారు. 5గంటల లోపు క్యూలో ఉన్న ఓటర్లను చివరి ఓటు నమోదు వరకు అనుమతించాలని నిబంధనలను వివరించారు. ఈవీఎం పరికరాల నోడల్ అధికా రి రామ్మోహన్‌రావు, శిక్షణ విభాగం నోడల్ అధికారి సంపత్‌రావు, ఈసీఐఎల్ ఇంజనీర్లు, మాస్టర్ ట్రైనర్స్, ఏఆర్‌ఓ కుమారస్వామి, మీడియా కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజిని, ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, సీఐలు చంద్రశేఖర్‌గౌడ్, ప్రమోద్‌రావు, వేణుగోపాల్, సెక్టర్ అధికారులు, పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి వెళ్తున్న సిబ్బంది

## 3 గంటల కరెంటు మాకెందుకు..?



కోల్‌సిటీ : కాంగ్రెస్ ఇస్తామంటున్న మూడు గంటల కరెంటు మాకెందుకు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుతో వాళ్ల సొమ్మేం పోతుంది. మూడెకరాలు ఉన్న రైతులకు 3 గంటల కరెంటు ఇస్తే ఎట్ల సరిపోతది. రాత్రిపూట పొలాల కాడకు పోయి కరెంటు అచ్చేదాక అక్కడే పడుకునే రోజులు మళ్లీ వస్తాయి. 10 హెచ్‌పీ మోటర్ బిగించుకుంటే సరిపోతది సింపుల్‌గా చెబుతున్నరు. మోసేటోళ్లకు తెలుస్తది బరువు. కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంటు, నీళ్లు ఎప్పుడూ సక్కగ లేవు. ఇప్పుడేమో 24 గంటల కరెంటు ఉంటుంది. పొలమంతా నీరు పారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మూడు గంటల కరెంటు ఇచ్చి రైతులను మళ్లీ ఇబ్బందుల పాలు చేస్తారా? ఇప్పుడు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను పంపుసెట్ల వద్ద పెట్టి నీళ్లు పారిస్తున్నం. 10 హెచ్‌పీ మోటర్లు అంటే మొదట్నుంచి అన్ని మార్చాలి. ఎంత లేదనుకున్న ఓ రూ. 50వేలకు పైనే ఖర్చయితది.

**కేశవేని వెంకటేష్, యువరైతు, లక్ష్మీపురం (రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్)**

## నాడు కరెంటు కోసం బోరువద్దనే పడుకున్న



తెలంగాణ రాకముందు కరెంటు కోసం బోరుబావి వద్దనే పడుకోని ఎదురు చూసేవాన్ని. రాత్రి 2గంటల కు వెళ్లి నిద్రలేక కరెంటు కోసం పడిగాపులు కాశాను. ఇప్పుడైతె పొద్దంత కరెంటు ఉంటుంది. నాకున్న నాలుగు ఎకరాలకు మస్తుగా సరిపోతుంది. అప్పుడు రైతులందరు ఒకే సారి కరెంటు ఆన్‌చేస్తే మోటర్లు కాలిపోయాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు తెలంగాన ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఫ్రీ కరెంట్‌తోని 10హెచ్‌పీ మోటర్ల అవసరమే లేదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే స్టార్టర్లు, పైప్‌లైన్లు మార్చాలే.

**చిట్టబోయిన ఓదెలు, ఎల్కలపల్లి రైతు**

## 10హెచ్‌పీ మోటర్లు ఎందుకు?



24గంటల కరెంటు ఇస్తున్నప్పుడు 10హెచ్‌పీ మోటర్ల ఎందుకు నేను 2హెచ్‌పీ, 3 హెచ్‌పీ మోటర్లు వాడుతున్న పూల్‌గా నీళ్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు మోటర్లు కూడ రిపేరు లేదు. 10హెచ్‌పీ మోటరు పెట్టుకుంటే ఇప్పుడున్న మోటర్లు ఏమి చేయాలి. రైతులను ఇబ్బంది పాలు చేయడానికి కాంగ్రెస్ నాయకులు 3గంటల కరెంటు చాలు.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు.

**బండారి ప్రసాద్, ఎల్కలపల్లి రైతు**

## మళ్ల పంచాయితీలు షురూ



పెద్దపల్లి కమాన్ :ధరణి పోర్టల్ రద్దు చేస్తే డిజిటల్ రికార్డులు మాయమవుతాయి. గతంలో మాదిరిగానే పల్లెల్లో కొట్లాటలు, గొడవలు షురూ అయితయ్. భూముల పంచాయతీలతో రైతులు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. గొడవలు, అవమానాలు భరించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తది. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి వ్యవస్థతోనే భూ సమస్యలు పోయాయి. ధరణి తీసేస్తే దళారీ వ్యవస్థ వస్తుంది. ధరణి పోర్టల్ ఉండాలి. కొనడం, అమ్మడం సులువుగా ఉంది.

**- కందుల వేణు, రైతు, సబ్బితం, (పెద్దపల్లి మండలం)**